# పిడిఎస్‌యుతో ప్రభంజనంకు సంబంధం లేదు

**సమస్త ప్రక్షాళనం -తెలంగాణ**

జన్నారం చెందిన ప్రభంజనంకు పి డి ఎస్ యు తో ఎలాంటి సంబంధం లేదని పి డి ఎస్ యు జిల్లా కమిటీ స్పష్టం చేసింది. గతంలో పి డి ఎస్ యు పేరుతో విద్యాసంస్థల యాజమాన్యాల వద్దకు వెళ్లిన సందర్భాలను యాజమాన్యాలే తమ దృష్టికి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అప్పుడే పత్రికా ప్రకటన ద్వారా ప్రభంజనంకు పిడిఎస్యుతో సంబంధం లేదని తెలియజేశామని చెప్పారు. ఈ విషయాన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు కూడా తెలియజేశామని వివరించారు.దలక్షెట్టిపేటలోని ఓ హాస్టల్లో జరిగిన వివాదంలో ప్రభంజనంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సంబంధిత హాస్టల్ కళాశాల యాజమాన్యం కూడా ప్రభంజనంపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయ్యిందని పేర్కొన్నారు. ఇకపై ప్రభంజనం పి డి ఎస్ యు పేరుతో యాజమాన్యాల వద్దకు వెళ్లినా, పి డి ఎస్ యు పేరుతో చందాలు వసూలు చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయని జిల్లా కమిటీగా హెచ్చరించినట్లు తెలిపారు. కాబట్టి మంచిర్యాల జిల్లాలో ప్రభంజనం ఎప్పుడూ, ఏ స్థాయిలోనూ పి డి ఎస్ యు లో సభ్యుడు కాదని మరోసారి స్పష్టం చేస్తున్నామని చెప్పారు.

# రాష్ట్ర 23వ మహాసభలకు పిడిఎస్యూ పిలుపు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

2026 జనవరి 5, 6, 7 తేదీల్లో వరంగల్‌లో జరగనున్న పిడిఎస్ యూ తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ మంచిర్యాల జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మార్క్స్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు పి. సికిందర్, కే. కార్తీక్ మాట్లాడుతూ.. మహాసభలు రాష్ట్ర విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీకాంత్ మాట్లాడుతూ మహాసభల విజయానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంజి పటేల్, ధనుష్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవ యే మాధవ సేవ.

## మానవత్వం చాటుకున్న పోలీస్ కానిస్టేబుల్.

**శెనార్తి మీడియా, ఆర్మూర్**

మానవ సేవ యే మాధవ సేవ అంటూ ప్రత్యేకత చాటుతున్న పోలీస్ కానిస్టేబుల్. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో రాత్రి తీవ్ర చలి కారణంగా వణుకుతూ ఉన్న సుమారు 80 సంవత్సరాల వృద్ధురాలిని చూసి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎల్.ఎస్. కుమార్, మానవత్వం చాటుకున్న పోలీస్ కానిస్టేబుల్ తన సేవాభావాన్ని చాటారు. వెంటనే ఒక బెడ్‌షీట్ తీసుకువచ్చి ఆ వృద్ధురాలికి కప్పి సహాయం చేశారు. కేవలం అధికార విధులు మాత్రమే కాదు, మనుషుల పట్ల ప్రేమ, స్పందన చూపడం సమాజంలో ఎంతో అవసరమని ఆయన మరోసారి నిరూపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనలోని మరో కోణాన్ని బయట పెట్టారు. వేసవికాలంలో అడవుల్లో దాహంతో అలమటించే కోతులకు, ఇతర జంతువులకు ప్రతిరోజూ ఫలాలు, ఆహారం అందజేస్తూ వస్తున్నానన్నారు. ప్రకృతి, జంతువులు, మనుషుల పట్ల ఎల్.ఎస్. కుమార్ చూపుతున్న సేవాభావం చాలా మందికి ప్రేరణగా నిలస్తోంది

# చెన్నూరు అభివృద్ధిపై దృష్టి

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వెంకటస్వామి



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కమ్యూనిటీ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీఎంఎఫ్‌టీ నిధులతో 20 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తిచేశామని, భవనం విస్తరణకు అదనంగా మరో 20 లక్షల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి చర్యలు చేపడతామని తెలిపారు. కమ్యూనిటీ భవనాన్ని దళిత సంఘాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ కోసం నిబంధనలతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో భీమారం మండలంలో 25 లక్షల రూపాయలతో నేతకాని భవనం, జైపూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో జగ్జీవన్ రామ్ భవనం, చెన్నూరు మండలంలో 25 లక్షల రూపాయలతో ముదిరాజ్ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూమి అందుబాటులో ఉంటే ప్రభుత్వం తరఫున భవన నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టామని, వచ్చే విడతలో 70 నుంచి 80 కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు కొనసాగిస్తామని తెలిపారు. అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతర త్రాగునీరు అందించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. చెన్నూర్ ప్రాంతంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, మే నెలలోపు భవన నిర్మాణం పూర్తి చేసి అవసరమైన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి కిడ్నీ బాధితులకు సేవలు అందిస్తామని చెప్పారు. అనంతరం 9 కోట్ల 55 లక్షల రూపాయల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ప్రజలకు ఒకేచోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకే ఈ మార్కెట్ ఏర్పాటు చేశామని, మాంసపు ఉత్పత్తులకు సంబంధించిన సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాత శిశు ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమృత్ పథకం కింద చెన్నూర్ మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలు, మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో త్రాగునీటి సరఫరా పనులు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పూర్తి సాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అంబేద్కర్ కమ్యూనిటీ భవనాన్ని బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చని, ఇక్కడ గ్రంథాలయ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమీకృత కూరగాయల మార్కెట్ ద్వారా వీధి వ్యాపారులకు ఒకే చోట వేదిక లభిస్తుందని, మార్కెట్‌లో సామూహిక సౌచాలయాల ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. అమృత్ పథకం కింద పైప్‌లైన్లు, మూడు నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తయ్యాయని, ఫస్ట్ ఫ్లోర్ పనులు త్వరగా పూర్తి చేస్తామని వివరించారు. అనంతరం చెన్నూర్ పట్టణ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి, మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో సమీక్షించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు తహసిల్దార్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విపత్తులపై అప్రమత్తత

- జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పశుసంవర్ధక, పోలీస్, వ్యవసాయ, అగ్నిమాపక, రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాల్ మాట్లాడుతూ... జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రజలకు ఇవ్వాల్సిన హెచ్చరికలు, ప్రజా అవగాహన కార్యక్రమాలపై అధికారులు స్పష్టత కలిగి ఉండాలని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని చెప్పారు. కాప్ (క్యాప్) వ్యవస్థ, అత్యవసర నిర్వహణ కేంద్రాల వినియోగంపై అవగాహన పెంచుకుని విపత్తుల సమయంలో ప్రజా రక్షణ చర్యలను అమలు చేయాలని తెలిపారు. వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటా బేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ నుంచి సమాచారాన్ని సేకరించి రక్షణ చర్యల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని విపత్తు ప్రభావిత ప్రాంతాలను తక్షణమే గుర్తించి క్రమబద్ధమైన నిర్వహణ ప్రక్రియ అమలు చేయాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో కనీసం 10 రోజులపాటు ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 22న అన్ని జిల్లాల్లో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు జిల్లాలోని చెన్నూర్ మండల తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల రక్షణ దిశగా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

# దివ్యాంగుల దినోత్సవం



**సమస్త ప్రక్షాళనం -తెలంగాణ**

మంచిర్యాల మండలం భవిత కేంద్రంలో మండల విద్యాధికారి వివిస్వి మాలవీదేవి సమక్షంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు పట్టుదలతో చదివి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సెక్టోరియల్ అధికారి చౌదరి, ఐఏఆర్పిలు సృజన, శ్రీలత, మండలంలోని దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో రోబోటిక్స్ పై శిక్షణ




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్" శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జై కిషన్ ఓఝా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సాంకేతిక యుగంలో రోబోటిక్స్ విద్యార్థులకు అత్యంత అవసరమైందని, విద్యా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని చెప్పారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఫర్హా యాస్మిన్ మాట్లాడుతూ... రోబోటిక్స్ ద్వారా భౌతిక శాస్త్రంలోని సిద్ధాంతాలను ప్రాయోగికంగా అర్థం చేసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుందని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు గులాం రసూల్ మాట్లాడుతూ, రోబోటిక్స్‌లో ప్రోగ్రామింగ్, తార్కిక ఆలోచన కీలక పాత్ర పోషిస్తాయని, ఇటువంటి శిక్షణలు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని చెప్పారు. మరో అధ్యాపకులు త్రివేణి మాట్లాడుతూ... విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై ఆసక్తి పెంచుకొని పరిశోధన, ఆవిష్కరణల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరీష్, గంగయ్య, కుమార స్వామి, గోపాల్ కృష్ణ, రాజయ్య, మహేష్, కరుణాకర్, కనక లక్ష్మి, మధుసూదన్, నవీన్, మంజుల పాల్గొన్నారు. అలాగే సోహం అకాడమీకి చెందిన సంతోష్, అజయ్, ఆదర్శ్ విద్యార్థులను ఉత్సాహపరుస్తూ శిక్షణా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎరువుల యాప్‌పై అవగాహన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, ఎరువుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల బుకింగ్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. యాప్ ద్వారా జిల్లాలో యూరియా నిల్వల సమాచారం నిజమైన సాగుదారులకు అందుతుందని చెప్పారు. ఎరువుల దుకాణాల వద్ద రద్దీ లేకుండా ఇంటి వద్దనే మొబైల్‌లో యాప్ వినియోగించి యూరియాను 24 గంటల్లో పొందవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు నిర్వహించవలసిన విధులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. యాప్ ద్వారా మాత్రమే యూరియా బుక్ చేసుకుని రైతులు లేదా సంబంధికులు బుకింగ్ ఐడీ, పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు పత్రాలను డీలర్ వద్ద ధ్రువీకరించుకుని యూరియా బస్తాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

